సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 22 । నవంబర్ । 2024



చెరకు క్రషర్ బెల్టులో చిక్కుకుని..

ఉపాధి ఉసురు తీసింది. చెరకు క్రషర్ బెల్టులో చిక్కుకుని ఓ మహిళ దుర్మరణం పాలైంది. ఆమె ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. 8లో



ఘరానా దొంగల అరెస్టు

వివిధ కేసుల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి బంగారం, సెల్ ఫోన్లు , బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. 8లో



మనాలిలో ఏయూ విద్యార్థులు

విశాఖ విద్య: మనాలిలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ప్రత్యేక సాహస శిబిరానికి ఏయూ నుంచి విద్యార్థుల బృందం వెళ్లింది.

న్యూస్‌రీల్

నీటి సంఘాల ఎన్నికలు వాయిదా

- డిసెంబర్ 8 నుంచి 14 వరకు నిర్వహణ

సాక్షి, అనకాపల్లి: జిల్లావ్యాప్తంగా ఈ నెలాఖరున జరగాల్సిన నీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడినట్లు జిల్లా నీటి సంఘాల ఎన్నికల నోడల్ ఆఫీసర్, ఈఈ త్రినాథ్ తెలిపారు. వచ్చే నెల 8వ తేదీ నుంచి 14 వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. జిల్లాలో 16 మేజర్, 28 మీడియం, 259 మైనర్ నీటిసంఘాలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియకు డిసెంబర్ 5వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసి.. 8వ తేదీన ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. 8న టీసీ మెంబర్, నీటి సంఘాల ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఎన్నికలు, 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు, 14న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ల ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు.

గంజాయి కేసులో వ్యక్తికి పదేళ్ల జైలు

విశాఖ లీగల్ : గంజాయి కలిగి ఉన్న వ్యక్తికి 10 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని ఒకటో ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ గురువారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా చెల్లించాలని లేకుంటే అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.ఎస్.ఎన్.వి.ప్రసాదరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. 2021 ఆగస్టు 19వ తేదీ సాయంత్రం 5 గంటల ప్రాంతంలో అనకాపల్లి జిల్లా కొత్తూరు పోలీసులు సోదాలు నిర్వహించగా రోడ్డు పక్కన ఇద్దరు వ్యక్తులు 20 కిలోల గంజాయి, రూ.2 వేల నగదుతో పట్టుబడారు. వీరిపై కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన నిందితుడు హర్షిత్ ఖాన్‌కు 10 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు

పెంచిన పనివేళలను ఉపసంహరించుకోవాలి

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్ డిమాండ్



కాశీపురం హైస్కూల్లో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్

దేవరాపల్లి: ఉన్నత పాఠశాలల్లో పెంచిన పనివేళలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్ డిమాండ్ చేశారు. పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాశీపురం, ఎ.కొత్తపల్లి, ముషిడిపల్లి, ఎం.అలమండ, కలిగొట్ల, తెనుగుపూడి తదితర పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన రాష్ట్రానికి ఇరువైపులా ఉన్న ఇతర రాష్ట్రాలలోని పాఠశాలల్లో 5 గంటల వరకు పనివేళలు ఎక్కడా లేవన్నారు. విద్యార్థులు పాఠశాలల్లో సుమారు 8 గంటలపాటు ఉండటంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురికావాల్సి వస్తుందన్నారు. ఈ ఇబ్బందుల దృష్ట్యా ఉన్నత పాఠశాలల్లో పనివేళలను పెంచే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. కొఠారి కమిషన్ సూచన మేరకు పాత పనివేళలను కొనసాగించాలన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సత్యంనాయుడు, మండల అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి అప్పారావు తదితర్లు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కలాసీలపై యువకుల దాడి

పూడిమడకకు చెందిన యువకులు మద్యం మత్తులో కలాసీలపై కర్రలు, రాడ్‌లతో దాడికి పాల్పడ్డారు. 8లో

పడమటమ్మకు నీరాజనం

8లో



అమ్మవారి పుట్టుక ఉత్సవాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజానీకం



బంతిపూలతో అందంగా అలంకరించిన అమ్మవారి పల్లకి

రెండేళ్లకు ఒకసారి జరిగే పడమటమ్మ పుట్టుక మహోత్సవం కశింకోటలో గురువారం వైభవంగా జరిగింది. పూల పల్లకిపై అమ్మవారి గరగలను విసన్నపేట వద్ద వెలసి ఉన్న అమ్మవారి లోవకు తీసుకొచ్చారు. అక్కడ గొంతిన కుటుంబీకులు, ఉత్సవ నిర్వాహకులు, యువకులు ఏడాకుల మర్రిచెట్టు రూపంలో వెలసి ఉన్న అమ్మ వారికి పూజలు జరిపారు. ఉత్సవానికి ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

గంజాయి రవాణా కట్టడికి పటిష్ట చర్యలు

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి
- పాయకరావుపేట, యలమంచిలి టౌన్ స్టేషన్లలో వార్షిక తనిఖీలు



పాయకరావుపేట పోలీస్‌స్టేషన్‌లో వార్షిక తనిఖీ చేస్తున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

సాక్షి, అనకాపల్లి: గంజాయి రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశించారు. మత్తు పదార్థాలు వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా పాయకరావుపేట, యలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్లను సందర్శించారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను, వాటి ప్రస్తుత దర్యాప్తు స్థితిని అడిగి తెలుసుకున్నారు. గంజాయి కేసుల పురోగతి, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, చీటింగ్ ఇతర కేసుల ఫైల్స్, స్టేషన్‌లో నిర్వహిస్తున్న జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, ప్రాపర్టీ రిజిస్టర్, కోర్టుకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వీలైనంత తొందరగా చార్జిషీట్ ఫైల్ చేయాలని, కోర్టులలో విచారణ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, ముద్దాయిలకు శిక్ష పడేటట్లు పకడ్బందీగా వ్యవహరించాలని సూచనలు చేశారు. ప్రతి మహిళకు భద్రత కల్పించేందుకు అండగా పోలీస్ శాఖ ఉందని వారికి భరోసా కల్పించాలని తెలిపారు. సైబర్ నేరాలపై గ్రామస్థాయి వరకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా, నర్సీపట్నం డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, పాయకరావుపేట సీఐ జి.అప్పన్న, యలమంచిలి రూరల్ సీఐ ఎస్.ధనుంజయరావు, ఎస్సైలు జె.పురుషోత్తం, సావిత్రి పాల్గొన్నారు.

సాంకేతిక ‘సహకారం’

- ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ
- సైబర్ భద్రత కోసం పీఏసీఎస్‌లలో కొత్త సాఫ్ట్‌వేర్
- జాతీయ, వాణిజ్య బ్యాంకులకు దీటుగా డిజిటల్ సేవలు
- డేటా సేకరణ, అప్‌లోడ్ పనులు ఈ నెలాఖరుకు పూర్తి



గొడిచర్ల పీఏసీఎస్‌లో వివరాలను అప్‌లోడ్ చేస్తున్న సిబ్బంది



సాక్షి, అనకాపల్లి: ప్రాథమిక సహకార సంఘాల (పీఏసీఎస్) కంప్యూటరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జాతీయ బ్యాంక్‌లకు దీటుగా ఇప్పటికే జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటికి అనుబంధంగా ఉన్న పీఏసీఎస్‌లలో కూడా డిజిటల్ సేవలు ఈ నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న సహకార బ్యాంకులు ప్రభుత్వ, ప్రైవేట్ వాణిజ్య బ్యాంక్‌లకు దీటుగా డిజిటలీకరణ చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంత ఖాతాదారులకు, రైతులకు ఆధునిక సాంకేతికతతో బ్యాంక్ సేవలను అందించడంలో రాష్ట్రంలోనే విశాఖ డీసీసీబీ తొలి అడుగు వేసింది. ఇప్పుడు వీటికి అనుబంధంగా పనిచేసే పీఏసీఎస్‌లలో కూడా అదే ఒరవడి కొనసాగిస్తోంది. సహకార సంఘాలకు చెందిన అన్ని రకాల రికార్డులు, సేవలను పూర్తిగా కంప్యూటరీకరించి ఆన్‌లైన్ సేవలకు అందుబాటులోకి తీసుకొస్తోంది.

14 పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ పూర్తి

రైతులకు ఆర్థికంగా ప్రోత్సాహం కల్పిస్తూ.. వారికి వెన్నెముకగా నిలిచే జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఖాతాదారులకు మొబైల్ బ్యాంకింగ్ సేవలను చేరువ చేసింది. తక్కువ వడ్డీతో రైతులకు రుణాలు అందించటంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ వంటి లావాదేవీలతో పాటు ఆన్‌లైన్‌లోనే రుణాలు పొందడం, వాయిదాలు చెల్లించడం వంటి సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. జిల్లాలో 74 సహకార సంఘాలున్నాయి. ఈ సంఘాల పరిధిలో సుమారుగా 2.62 లక్షల మంది ఖాతాదారులున్నారు. జిల్లాలో గత మూడు నెలల నుంచి కంప్యూటరీకరణ జరుగుతోంది. ఈ నెలాఖరుకు పూర్తిస్థాయిలో డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. జిల్లాలో ఇప్పటివరకూ 14 పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ పనులు పూర్తయ్యాయి. మిగతావి దాదాపు చివరి దశలో ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

కొత్త సాఫ్ట్‌వేర్‌తో డేటా భద్రం

సైబర్ నేరగాళ్లను కూడా తట్టుకునేలా ప్రాథమిక సహకార బ్యాంకుల్లో కొత్త సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తున్నారు. దీంతో డేటా అత్యంత భద్రంగా ఉంటుంది. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకుల్లో పాత కోర్ బ్యాంకింగ్ సాఫ్ట్‌వేర్ స్థానంలో విజయవాడ సంస్థ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చారు. దీంతో సైబర్ నేరగాళ్ల నుంచి బ్యాంక్‌ల డేటా భద్రంగా ఉంటుంది. ఇంతవరకు పీఏసీఎస్‌లలో మాన్యువల్‌గానే లావాదేవీలను నమోదు చేసేవారు. డిజిటలైజేషన్‌లో వెనుకబడి కొత్త ఖాతాదారులను ఆకర్షించలేక.. వ్యాపార లక్ష్యాలను అందుకోలేక జిల్లా సహకార బ్యాంక్‌లు చాలా అవస్థలు పడుతున్నాయి. ఈ పరిస్థితులను మార్చేందుకు ఇతర వాణిజ్య బ్యాంక్‌లతో సమానంగా డీసీసీబీ బ్రాంచ్‌లను అభివృద్ధి చేయడం.. వాటి ద్వారా పీఏసీఎస్‌లను కూడా డిజిటలైజేషన్ చేయడం ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తున్నాయి.

ఈకేవైసీ త్వరితగతిన చేయించుకోవాలి

జిల్లాలో కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తికావచ్చింది. ఈ నెలాఖరునాటికి పూర్తి చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశించారు. పీఏసీఎస్‌లలో ఖాతాదారులైన రైతులంతా ఈకేవైసీ చేయించుకోవడం ద్వారా త్వరితగతిన ఈ ప్రక్రియ పూర్తవుతుంది. సభ్య రైతులు ముందుకు వచ్చి మా సిబ్బందికి సహకరించాలని కోరుతున్నాం.

–ఎ.ప్రేమ స్వరూపరాణి,
సహకార సంఘాల జిల్లా అధికారి

రైతులకు చాలా ఉపయోగం

ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేస్తే సహకార సంఘాలు మరింత బలోపేతం అవుతాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే కంప్యూటరీకరణకు శ్రీకారం చుట్టారు. రికార్డుల డిజిటలైజేషన్ వల్ల రైతులకు పలు ప్రయోజనాలు కలుగుతాయి. పంట రుణాలే కాకుండా రాయితీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్రాలు అందజేస్తారు.

– రాజేష్ కన్నా, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు,
పాయకరావుపేట

వేంపాడులో భూ సర్వేను అడ్డుకున్న రైతులు



భూముల సర్వే చేపట్టవద్దని అధికారులతో రైతుల వాగ్వాదం

నక్కపల్లి: రైతులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, వారికి తెలియకుండా భూములు సర్వే చేయడం ఏమిటంటూ పలువురు రైతులు సర్వే అధికారులను నిలదీశారు. గురువారం వేంపాడు, నెల్లిపూడి గ్రామాల పరిధిలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే గోపాలరాజు ఆధ్వర్యంలో సర్వే బృందం భూముల సర్వే ప్రారంభించేందుకు రాగా రైతులు అడ్డుకున్నారు. ఇప్పటికే ఏపీఐఐసీ వారు రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కున్నారని, మళ్లీ భూముల జోలికి ఎందుకు వస్తున్నారంటూ నిలదీశారు. తమకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా భూముల్లోకి వచ్చి సర్వే ప్రారంభించే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, కనీసం గ్రామ సభలు నిర్వహించకుండా రైతులకు సంబంధించిన జిరాయితీ భూముల్లో సర్వే చేయడం సమంజసం కాదన్నారు. సర్వే ఎందుకు చేస్తున్నారు, ఎవరు చేయమన్నారు.. తదితర వివరాలు తెలియజేయకుండా సర్వే చేయడానికి కుదరదని రైతులు అయినంపూడి రవిరాజు, పేరూరి బాబ్జీ తదితరులు అడ్డుకోవడంతో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామంటూ అధికారులు సర్వే నిలిపివేసి వెనక్కి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గోప్యంగా సర్వే చేయాల్సిన అవసరం ఏమొచ్చిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మార్గశిర మాసోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు



ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో ఈవో శోభారాణి, ఈఈ సీహెచ్‌వీ రమణ

మహారాణిపేట (విశాఖ): వచ్చే నెల 2 నుంచి 30 వరకు కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం పరిధిలో జరగనున్న మార్గశిర మాసోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్ మీటింగ్ హాల్లో గురువారం సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, సరిపడా క్యూలైన్లు, మంచినీటి సదుపాయం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్య నిర్వహణ, అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, నిత్యాన్నదానం, ప్రసాదం కౌంటర్, క్యూలైన్ల వద్ద సరిపడా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. రోడ్డుకు ఆనుకుని ఉన్న దుకాణాలను వెనక్కి జరపాలన్నారు.

ప్రతి రోజూ అన్నదానం

భక్తుల సౌకర్యార్థం ఉత్సవాలు జరిగినన్ని రోజులు ఉదయం 11.00 గంటల నుంచి జగన్నాథస్వామి ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ ఉంటుందని, డిసెంబర్ 26న సున్నపువీధి దిగువ నుంచి కొత్త రోడ్డు వరకు ఉన్న రోడ్డుపై మహాన్నదానానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉప కమిషనర్, ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. ఉచిత, సర్వ దర్శనాలకు ప్రాధాన్యత ఇస్తూ వీఐపీ పాసులను పరిమితం చేసి, దర్శన వేళలను కూడా కుదించామన్నారు.

దర్శన వేళలు

నాలుగు గురువారాలు(డిసెంబర్ 05, 12, 19, 26) తెల్లవారు జాము నుంచే దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. సాధారణ రోజుల్లో ఉదయం 6 నుంచి 11.30, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30, తిరిగి రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వ దర్శనం ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ, ఈఈ సీహెచ్‌వీ రమణ, సహాయక ఈవో తిరుమలేశ్వరరావు, అధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన సీ విజిల్ విన్యాసాలు



వివిధ తీరాల్లో సీ విజిల్ విన్యాసాలు

సాక్షి, విశాఖపట్నం : తీర ప్రాంతంపై భారత రక్షణ దళం పట్టుని ప్రదర్శించేందుకు ఏటా నిర్వహిస్తున్న సీవిజిల్–2024 ఘనంగా ముగిసింది. రెండు రోజుల పాటు భారత నౌకాదళం నేతృత్వంలో సీవిజిల్–2024 పేరుతో యుద్ధ విన్యాసాలు జరిగాయి. సముద్ర తీర రేఖ కలిగి ఉన్న ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఒడిశా, పుదుచ్చేరి సహా 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ విన్యాసాలు విజయవంతంగా నిర్వహించారు. మొత్తం 6 మంత్రిత్వ శాఖలు, 21 విభాగాలు, ఏజెన్సీలు ఈ విన్యాసాల్లో భాగస్వామ్యమయ్యాయి. మత్స్యకారుల రూపంలో ఉగ్రమూకల చొరబాటు, చేపల వేటకు వెళ్లి సరిహద్దులు దాటిన జాలర్లను సురక్షితంగా తీసుకురావడం, ఆకస్మిక దాడుల్ని సమర్థవంతంగా ఎదుర్కోవడం.. ఇలా.. భిన్నమైన విన్యాసాలతో అలరించారు.

మీనాలు మిలమిల



తాండవలో చేప పిల్లలను విడుదల చేస్తున్న కలెక్టరు విజయ కృష్ణన్

- పండగను తలపించేలా తాండవలో మత్స్యకార దినోత్సవం
- జలాశయంలో 5 లక్షల చేప పిల్లలు విడుదల చేసిన కలెక్టర్

నాతవరం: తాండవ జలాశయం ఒడ్డున గురువారం మత్స్యకార దినోత్సవం సందడిగా జరిగింది. కలెక్టర్ విజయ కృష్ణన్ పాల్గొని రిజర్వాయర్‌లో ఐదు లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా తాండవ ప్రాజెక్టు వద్ద మత్స్యకారులతో ముచ్చటించారు. చేపల పెంపకం ద్వారా తాండవ ప్రాజెక్టు పరిధిలో గల 30 గ్రామాల్లో వేట సాగించే మత్స్యకారులకు ఉపాధి దొరుకుతుందన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 44 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయని, వాటిలో 3 వేలమందికి పైగా సభ్యులు ఉన్నారన్నారు. వారందరికీ త్వరలో రాయితీపై వలలు, బోట్లు అందిస్తామన్నారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా ప్రమాదాల్లో ఆరుగురు మత్స్యకారులు మరణించారని, త్వరలో వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల వంతున ఎక్స్‌గ్రేషియా పంపిణీ చేస్తామన్నారు.

కలెక్టర్ దృష్టికి సమస్యలు

ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. తాండవ ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టు భూములకు నీరందించే ప్రధాన కాలువల్లో పూడిక పేరుకుపోయి శివారు ఆయకట్టుకు నీరు ప్రవహించడం లేదని, ఖరీఫ్ సీజన్ అనంతరం పూడిక పనులు చేపట్టాలని మాజీ జెడ్పీటీసీ కరక సత్యనారాయణ కలెక్టరుకు వినతి పత్రం అందించారు. తాండవ రిజర్వాయరుకు సమీపంలో ఉన్న హెల్త్ సబ్ సెంటరును చమ్మచింత తరలించారని, సబ్ సెంటరు ఈ ప్రాంతంలో ఉంటే 8 గ్రామాల్లోని 5 వేల మంది ప్రజలకు వైద్యం అందుతుందని మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్ అన్నారు. తాండవ నదిలో కూటమి పార్టీల నేతలు నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారని, వాటిని అరికట్టాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, మండల ప్రత్యేకాధికారి నాగ శిరీష, మత్స్యశాఖ ఏడీ జాహ్నవి, నర్సీపట్నం మత్స్యశాఖాధికారి నాగమణి, ఎంపీడీవో ఉషశ్రీ,, స్థానిక సర్పంచ్ కొండబాబు, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మత్స్యకార సంఘాల అధ్యక్షుడు నక్కా రమణ పాల్గొన్నారు.

తాండవ రిజర్వాయర్ సందర్శన

ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టు రైతులకు ఎలాంటి సమస్య లేకుండా చూసుకునే బాధ్యత మీపైనే ఉందని కలెక్టర్ విజయ కృష్ణన్ తాండవ ప్రాజెక్టు అధికారులతో అన్నారు. ఆమె మొదటిసారి గురువారం తాండవ రిజర్వాయరును సందర్శించి ప్రాజెక్టులో నీటి నిల్వలను పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను డీఈ అనురాధను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉన్నందున నీటిని పుష్కలంగా అందించాలని డీఈకి సూచించారు. ప్రాజెక్టు జేఈ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

అతివలపై ఆగడాలు.. ఎన్నాళ్లీ అఘాయిత్యాలు ?



నర్సీపట్నం అబిద్‌సెంటర్‌లో విద్యార్థుల మానవహారం

న్యాయ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులతో ర్యాలీ జరిపి అబిద్‌సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి జనార్దన్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. రాజకీయ ఒత్తిడులకు తలొగ్గి అధికారులు చట్టాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో డీవైఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు గౌతమ్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు ఎల్.గౌరి తదితరులు పాల్గొన్నారు.

- నర్సీపట్నం

పడమటమ్మకు భక్తుల నీరాజనం

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కశింకోట : కశింకోటలో పడమటమ్మ పుట్టుక మహోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. స్థానికులతోపాటు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ప్రజలు ఉత్సాహంగా హాజరయ్యారు. దీంతో జనంతో కిక్కిరిసి పండగ కళకళలాడింది. రెండేళ్లకు ఒక మారు జరిగే పండగ సందర్భంగా అందంగా పూలతో అలంకరించిన పల్లకి పై అమ్మవారి గరగలను సంప్రదాయ డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపుగా విసన్నపేట వద్ద వెలసి ఉన్న అమ్మ వారి లోవకు చేరుకున్నారు. గొంతిన కుటుంబీకులు, ఉత్సవ నిర్వాహకులు, యువకులు ఎక్కువ సంఖ్యలో హాజరై ఏడాకుల మర్రి చెట్టు రూపంలో వెలసి ఉన్న అమ్మ వారికి పూజలు జరిపారు. అనంతరం అమ్మ వారి ప్రతి రూపాన్ని కుంకుమ భర్నిలో నిలిపి పలకీలో ఉంచి విసన్నపేట, తమ్మయ్యపేట పొలాల మీదుగా కశింకోట శివారు వద్దకు ఊరేగింపుగా తీసుకు వచ్చారు. అక్కడి నుంచి పల్లకీలో ఉత్సవ ఊరేగింపు ప్రారంభమైంది. దారి పొడవునా ప్రజలు అమ్మవారి ప్రతి రూపాన్ని దర్శించి భక్తి పారవశ్యం చెందారు. ఉత్సవం సందర్భంగా భారీ గా బాణసంచా కాల్చారు. ఆకర్షణీయంగా విద్యు ద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. అయోధ్య రామ మందిరం, వినాయకుడు, అలివేలు మంగ, వేంకటేశ్వరస్వామి కటౌట్లు ఆహూతులను ఆకట్టుకున్నా యి. ఆకాశ చక్రాలు, రంగుల రాట్నాలపై పిల్లలతో పాటు పెద్దలు ఉత్సాహంగా తిరుగాడారు.


దేవతా మూర్తి విద్యుద్దీపాలంకరణ


ఏడాకుల మర్రి రూపంలో వెలసి ఉన్న పడమటమ్మ వారికి పుట్టుక ఉత్సవ పూజలు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు:
ఉత్సవం సందర్భంగా డాన్స్ బేబీ డాన్స్, డాన్స్, డూప్స్ బాబోయి డూప్స్, బుర్ర కథలు, రికార్డింగ్ డాన్సలు నిర్వహించారు. కురుక్షేత్రం, తదితర పౌరాణిక వేషధారణలతో ఏర్పాటు చేసిన స్టేజి సెట్టింగ్‌లు ఆకట్టుకున్నాయి.

భక్తులతో పోటెత్తిన పడమటమ్మ ఆలయం
పుట్టుక ఉత్సవం పురస్కరించుకొని విసన్నపేట, కశింకోట గ్రామాల్లో ఉన్న పడమటమ్మ వారి ఆలయాలు, విసన్నపేటలో చెట్టు రూపంలో కొలువై ఉన్న అమ్మవారు దర్శనానికి భక్తులు పోటెత్తారు. చీరలు, రవికెలు, అరటి గెలల రూపంలో అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. మహిళల కోలాటాలు ప్రదర్శించారు.

అమ్మవారిని దర్శించిన భరత్‌కుమార్
విసన్నపేటలోని పడమటమ్మ వారి ఆలయాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ నాయకుడు ఉప్పనూరి అప్పారావు పాల్గొన్నారు. కూటమి నాయకులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. ఉత్సవం సందర్భంగా అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ స్వామినాయుడు తమ సిబ్బందితో పర్యవేక్షించారు.

మత్తు వీడితేనే మంచి భవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి, ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

- యువత మాదకద్రవ్యాల ఉచ్చులో చిక్కుకోవద్దు
- డీఐజీ గోపీనాథ్ జెట్టి

పాయకరావుపేట: మాదకద్రవ్యాల మత్తులో పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి విద్యార్థులకు సూచించారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'సంకల్పం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో యువత పెడదారి పడుతోందన్నారు. మాదకద్రవ్యాలను రవాణా చేయడం, వాటిని అమ్మడం వంటివి చేపట్టి భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని, ఇటువంటి నేరాల్లో పాల్గొంటే 20 సంవత్సరాల జైలు శిక్ష అనుభవించవలసి ఉంటుందన్నారు. టెక్నాలజీ పెరిగి సోషల్ మీడియా ప్రభావంతో నేరాలు పెరిగాయని, సైబర్ క్రైం సమస్యగా మారిందని, వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. వీటిని నివారించడానికి పోలీసు వ్యవస్థ నిత్యం తన సామర్థ్యాన్ని పెంపొందించుకుంటోందని, విద్యార్థులను జాగృతం చేయడానికి 'సంకల్పం' కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ ఒకసారి సరదాగా చెయ్యాలని అనిపించే దురలవాట్లు వ్యసనంగా మారతాయని, వాటి జోలికి వెళ్లవద్దని తెలిపారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత గమ్యాలను చేరుకోవడానికి నిత్యం శ్రమించాలన్నారు. మాదకద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలను వీడియోల ద్వారా ప్రదర్శించారు. మాదకద్రవ్య రహిత సమాజం నిర్మిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ డీఐజీ, ఎస్పీలను సత్కరించారు. డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, సీఐలు జి.అప్పన్న, కుమారస్వామి, రామకృష్ణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ భూముల పునర్విచారణకు గడువు నేడు

- ఆర్డీవో వి.వి.రమణ

రోలుగుంట: ఫ్రీ హోల్డ్ భూములపై రెవెన్యూశాఖ చేపట్టిన పునర్విచారణ గడువు శుక్రవారం వరకే ఉందని లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. తహసీల్దార్ ఎస్.నాగమ్మ ఇటీవల మండలంలో నిర్వహించిన భూ రిసర్వే, ఫ్రీ హోల్డ్ భూముల పునర్విచారణ విషయాలపై చర్చించారు. గత నెలలో చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమం గత వారంలోనే విజయవంతంగా పూర్తయిందని తహసీల్దార్ తెలిపారు. మండలంలో ఫ్రీ హోల్డ్ భూములు సుమారుగా 1162 ఎకరాల 38 సెంట్లు ఉన్నాయని ఆర్డీవోకి తెలిపారు. దీనిపై ఆయన మాట్లాడుతూ మండలంలో రైతుల భూ సమస్యలపై వచ్చిన వినతులపై త్వరితగతిన స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్లు జారీ వ్యవహారంపై మరోసారి విచారణ చేపట్టాలని అధికార యంత్రాంగం నిర్ణయించిందని, ఈమేరకు విచారణ జరుపుతున్నామన్నారు. నర్సీపట్నం డివిజన్ పరిధిలో సుమారు 4000 ఫ్రీ హోల్డ్ భూములున్నాయన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సంబంధిత భూముల(అసైన్డ్) రైతులతో మాట్లాడడంతో పాటు రికార్డులు పరిశీలించడం జరుగుతుందన్నారు. అందుకోసం 10 బృందాలు పనిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన డీ పట్టాలు ఇచ్చిన నాటి నుంచి 20 ఏళ్లు సాగులో ఉన్నట్టు తమ విచారణలో తేలితే ఆ లబ్ధిదారు సాగులో ఉన్న భూమిని జిరాయితీగా మార్చి అన్ని హక్కులు కల్పించే అవకాశం ఉంటుందన్నారు. దీంతో అర్హత గల లబ్ధిదారులకు పూర్తి న్యాయం జరుగుతుందని, స్థానికేతరులకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుందని తెలిపారు.


తహసీల్దార్ ఎస్.నాగమ్మతో ఫ్రీ హోల్డ్ భూముల వివరాలపై చర్చిస్తున్న ఆర్డీవో రమణ

ముగ్గురు ఘరానా దొంగల అరెస్టు

- నాలుగు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్, నగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగలు, వాహనాలు పరిశీలిస్తున్న ఎస్పీ

అనకాపల్లి : జిల్లాలో వివిధ కేసుల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి బంగారం, సెల్‌ఫోన్లు , బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. తమ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, సుమారుగా రూ.21 లక్షల 30వేలు విలువ కలిగిన 188 గ్రాముల బంగారం, మోటార్ సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. గొలుగొండ మండలం కేడీపేట గ్రామం ఎస్పీ కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు, విశాఖ పెదగంట్యాడ మండలం గంగవరం, ధారవీధికి చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. యలమంచిలి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 4 కేసుల్లో సుమారుగా రూ.11 లక్షల 30వేలు విలువ గల 45 గ్రాముల బంగారు హారం, 4 ద్విచక్ర వాహనాలు, ఒక సెల్‌ఫోన్, పరవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 5 చోరీ కేసుల్లో రూ.10 లక్షల విలువ గల 143 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో అదనపు క్రైం ఎస్పీ ఎల్.మోహన్‌రావు, పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, సీసీఎస్ సీఐ కె.అప్పలనాయుడు, సీఐలు ధనంజయరావు, గణేష్, సీసీఎస్ ఎస్ఐ రమేష్, సత్యనారాయణ, ఏఎస్ఐ కుమార్, హెచ్‌సీ అప్పలరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యువ ఉత్సవ్ పోటీలకు ఎంపిక

మాడుగుల రూరల్ : జిల్లా స్థాయి ఉపన్యాస పోటీల్లో మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ గణిత విద్యార్థిని, ఎన్ఎస్ఎస్ వలంటీర్ అనూష కుమారి ప్రథమ బహుమతి సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని యువ ఉత్సవ్ 2024 కార్యక్రమంలో భాగంగా, విశాఖ నెహ్రూ యువ కేంద్రం జిల్లా స్థాయి యువ ఉత్సవ పోటీలు అనకాపల్లి జిల్లా గౌరీ గ్రంథాలయంలో ఈ నెల 16న నిర్వహించారు.

ఈ పోటీల్లో భారతదేశం -2047 అనే అంశం గురించి ఉపన్యసించారు. పోటీల్లో జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనగా, అనూష కుమారి ప్రథమ బహుమతి సాధించింది. ఆమెకు రూ.5000 నగదు పారితోషికం, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనూషకుమారికి గురువారం సాయంత్రం మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ శాస్త్రి, ఇతర ఉపన్యాసకులు, ఉపాధ్యాయేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు.


మాడుగుల డిగ్రీ కళాశాలలో అనూష కుమారిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శాస్త్రి, ఇతర ఉపన్యాసకులు

మద్యం మత్తులో కలాసీలపై యువకుల దాడి

- ఆరుగురికి గాయాలు, కేసు నమోదు



ఘర్షణ జరిగిన ప్రాంతంలో ఇరువర్గాలు, చికిత్సపొందుతున్న కలాసీ

యలమంచిలి రూరల్/రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి ఎస్ఈజెడ్ (పారిశ్రామికవాడ) పరిధిలో వింతా ల్యాబ్స్, వసంత కెమికల్స్ ప్రాంతం వద్ద కొట్లాట జరిగింది. పూడిమడకకు చెందిన యువకులు మద్యం మత్తులో కలాసీలపై కర్రలు, రాడ్‌లతో దాడికి పాల్పడ్డారు. స్థానికులను భయభ్రాంతులకు గురిచేసిన ఈ ఘటనకు సంబంధించి రాంబిల్లి సీఐ నర్సింగరావు, బాధితులు తెలిపిన వివరాలివి. బుధవారం రాత్రి పారిశ్రామిక వాడలో వింతా ల్యాబ్స్ వద్ద కలాసీలు కూర్చునేచోట పూడిమడక గ్రామానికి చెందిన ఒక యువకుడు మూత్ర విసర్జన చేస్తున్నాడు. మేమంతా కూర్చునే స్థలంలో మూత్ర విసర్జన చేయడమేమిటని, దూరంగా వెళ్లాలని ఆ యువకుడికి అక్కడున్న కలాసీ చెప్పాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఆ యువకుడు నువ్వెవడ్రా నాకు చెప్పడానికి అంటూ అతనితో గొడవకు దిగి కొట్టాడు. విషయం తెలుసుకున్న డ్యూటీలో ఉన్న కొంతమంది కలాసీలు అక్కడకు చేరుకున్నారు. అదేవిధంగా పూడిమడకకు చెందిన మరో ఆరుగురు యువకులు కూడా ఆటోలో అక్కడకు చేరుకున్నారు. రెండు వర్గాల మధ్య స్వల్ప వివాదం చివరకు కొట్లాటగా మారింది. పూడిమడకకు చెందిన యువకులు తమతో తెచ్చుకున్న ఇనుపరాడ్లు, కర్రలతో మారణాయుధాలతో దాడికి పాల్పడడంతో పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు. రాంబిల్లి పోలీసులకు సమాచారం అందడంతో వారు ఘటనా స్థలానికి చేరుకునేసరికి పూడిమడక యువకులు అక్కడ్నుంచి పరారయ్యారు. గాయపడిన ఆరుగురు కలాసీలకు సమీపంలో ఉన్న బెస్ట్ కేర్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. గాయపడిన కలాసీలు గురువారం యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి వచ్చి చికిత్స పొందారు. ఈ ఘటనలో రుత్తల సంజీవి, పల్లా సాంబశివరావు, రుత్తల శ్రీనివాసరావు, రాజాన సురేశ్, లాలం సత్య రామకష్ణ, లాలం రమణ గాయపడ్డారని సీఐ నర్సింగరావు చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నర్సీపట్నం: స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో కార్మికులు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.కోటేశ్వరరావు, పి.ఎస్.వి.పరమేశ్వరరావు మాట్లాడుతూ ఎండీ ఇచ్చిన 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. టిక్కెట్ తీసుకునే బాధ్యత ప్రయాణికులకే ఉండాలని, ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన జీవో నెంబర్ 70, 71 మార్పు చేయాలని పేర్కొన్నారు. డ్రైవర్, కండక్టర్, మెకానిక్ ఏడీసీలు, సూపర్‌వైజర్లు, ఆఫీస్ సిబ్బంది తదితర అన్ని కేటగిరీల ఉద్యోగులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, పెండింగ్ మెడికల్ బిల్లులు చెల్లించాలని, నైట్ అవుట్, డే అవుట్ అలవెన్సులు, ఇన్సెంటివ్‌లు చెల్లించాలని, పదోన్నతులు కల్పించాలని కోరారు. థర్డ్ పార్టీ కాంట్రాక్టు విధానాన్ని రద్దుచేసి నేరుగా ఆర్టీసీ జీతాలు చెల్లించాలన్నారు. ధర్నాలో పి.సుబ్బారావు, ఎస్.రమణ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

రేపటి నుంచి 'ట్వంటీ- 20'

- ఎస్ఎంఏ టోర్నీకి విశాఖ సిద్ధం

విశాఖ స్పోర్ట్స్: దేశవాళీ ధనాధన్(టీ-20) క్రికెట్‌కు వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియం సిద్ధమైంది. దేశంలోని 38 జట్లు ఐదు గ్రూప్‌ల్లో సయ్యద్ ముస్తాక్ అలీ(ఎస్ఎంఏ) ట్రోఫీలో తలపడుతుండగా విశాఖ వేదికగా గ్రూప్ డీ పోటీలు జరగనున్నాయి. బుధవారం విశాఖ చేరుకున్న జట్లు గురువారం ప్రాక్టీస్ మొదలుపెట్టాయి. ఒడిశా, చత్తీస్‌గఢ్ జట్లు శుక్రవారం ప్రాక్టీస్ చేయనున్నాయి. వైఎస్సార్ స్టేడియంలో ఈ నెల 23 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు రోజు విడిచి రోజు పోటీలు జరగనున్నాయి. ప్రస్తుతం ఇక్కడ ఆడనున్న ఏడు జట్లలో గతేడాది విదర్భ జట్టు డీ గ్రూప్ విజేతగా నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోగా అసోం బీ గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచి ప్రీక్వార్టర్స్ ఆడింది. విదర్భ జట్టు క్వార్టర్స్‌లోనే వెనుదిరగ్గా.. అసోం జట్టు సెమీస్‌కు చేరుకుంది. ఆంధ్రా జట్టు సీ గ్రూప్‌లో ఏడు మ్యాచ్‌లాడి మూడు విజయాలు, నాలుగు పరాజయాలతో ఆరో స్థానంలో నిలిచింది. ఈ సారి ఆంధ్రా 'ఈ'గ్రూప్‌లో ఆడనుంది.

ఇదీ షెడ్యూల్

తేదీ	సమయం	ఎవరితో ఎవరు
నవంబర్ 23	ఉదయం 11	చండీగఢ్ X పుదుచ్చేరి
	సాయంత్రం 4.30	విదర్భ X ఒడిశా
25	ఉదయం 11	చండీగఢ్ X విదర్భ
	సాయంత్రం 4.30	చత్తీస్‌గఢ్ X పుదుచ్చేరి
27	ఉదయం 11	చత్తీస్‌గఢ్ X రైల్వేస్
	సాయంత్రం 4.30	అసోం X చండీగఢ్
29	ఉదయం 11	అసోం X విదర్భ
	సాయంత్రం 4.30	ఒడిశా X పుదుచ్చేరి
డిసెంబర్ 1	ఉదయం 11	చత్తీస్‌గఢ్ X ఒడిశా
	సాయంత్రం 4.30	విదర్భ X రైల్వేస్
3	ఉదయం 11	అసోం X ఒడిశా
	సాయంత్రం 4.30	చండీగఢ్ X రైల్వేస్
5	ఉదయం 11	పుదుచ్చేరి X రైల్వేస్
	సాయంత్రం 4.30	అసోం X చత్తీస్‌గఢ్

చెరకు క్రషర్ బెల్టులో చిక్కుకుని మహిళ మృతి


మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు (ఇన్‌సెట్) మృతురాలు పద్మ(ఫైల్)

మాకవరపాలెం/కోటవురట్ల : చెరకు క్రషర్ బెల్టులో చీర చిక్కుకుని ఓ మహిళ మృతి చెందింది. మండలంలోని జంగాలపల్లి శివారు కాలనీలో నివాసం ఉంటున్న శరకం పద్మ(49) ఇదే గ్రామంలో ఉన్న ఓనా బెల్లం తయారీ ఫ్యాక్టరీలో పనిచేస్తుంది. గురువారం ఉదయం పనికి వెళ్లి పద్మ చెరకును క్రషర్ బెల్టుపై వేసే క్రమంలో చీరకొంగు బెల్టులో చిక్కుకోవడంతో చీర ఆమె మెడకు బిగుసుకుని అక్కడిక్కకడే మృతి చెందింది. ఈ సంఘటనపై అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ దామోదర్‌నాయుడు విలేకరులకు తెలిపారు.

అమ్మ దూరమై...పిల్లలు అనాథలై...
కంటికి రెప్పలా బిడ్డలను సాకుతూ రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషిస్తున్న పద్మ మృతితో ఆమె ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకుంటే ఓ మంచి కుటుంబంతో సంతోషంగా గడుపుదామనుకున్న ఆమె ఆశలు తీరకముందే అసువులు బాసింది. కోటవురట్ల మండలంలోని రాజుపేట గ్రామం బీసీ కాలనీలో రెండు వీధులు మాకవరపాలెం మండలం జంగాలపల్లి రెవెన్యూ పరిధిలోకి వస్తాయి. ఆ వీధికి చెందిన శరకం పద్మ(49) గ్రామ శివారున ఉన్న వైనా(వివైఎన్ఏ) ఆర్గానిక్ బెల్లం తయారీ కంపెనీలో గమూడేళ్లుగా రోజువారీ కూలీగా పనిచేస్తోంది. చెరకు సీజనులో మాత్రమే పనిచేసే ఈ కంపెనీలో వారం రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. వారం రోజులుగా పనికెళుతున్న పద్మ గురువారం ఉదయం క్రషర్‌లో చెరకు వేసేందుకు వెళుతుండగా క్రషర్ బెల్ట్‌కు చీర చెంగు చిక్కుపడి బెల్ట్ లాక్కుని పోయింది. ఈ క్రమంలో చీర ఆమె మెడకు చుట్టుకుని బిగుసుకుపోవడంతో ఊపిరాడక మృతి చెందింది. సహచరుల కేకలతో పవర్ ఆపి వెళ్లి పద్మను బయటకు తీసి 108 వాహనానికి ఫోన్ చేశారు. సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్టు నిర్ధారించారు. దాంతో క్రషర్ యాజమాన్యం ఆమె మృతదేహాన్ని ఆమె ఇంటికి తరలించారు. అయితే సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని ఇంటికి తరలించడంపై కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. క్రషర్ యాజమాన్యం మృతురాలి కుటుంబానికి పరిహారం ఇచ్చేందుకు అంగీకరించడంతో వివాదం సద్దుమణిగింది. మృతురాలి భర్త సత్తిబాబు 15 ఏళ్ల క్రితం పచ్చకామెర్ల వ్యాధితో మృతి చెందాడు. అప్పుడు ఇద్దరు పిల్లలు చిన్నవాళ్లు కావడంతో పోషణ భారం పద్మపై పడింది. కూలిపని చేస్తూ పిల్లలను పెంచుతూ వస్తోంది. పెద్ద కొడుకు సాగర్ మానసిక వికలాంగుడు కావడంతో మరింత భారం ఆమెపై పడింది. చిన్న కొడుకు కిషోర్ విజయనగరం జిల్లాలో డిప్లొమా చేస్తున్నాడు. చిన్న కొడుకు అందొస్తే కష్టాలు తీరిపోతాయని కష్టపడి చదివిస్తోంది. ఈ క్రమంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో పిల్లలు ఇద్దరూ అనాథలయ్యారు. మానసిక వైకల్యంతో ఉన్న సాగర్ అచేతనంగా పడి ఉన్న అమ్మను అమాయకంగా చూస్తుంటే స్థానికుల హృదయాలు ద్రవించిపోయాయి. పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్న స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.


మానసిక వైకల్యం ఉన్న పెద్ద కొడుకు సాగర్

క్లుప్తంగా

లైంగిక దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

అనకాపల్లి: టీడీపీ ప్రభుత్వంలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, విశాఖలో న్యాయ విద్యార్థినిపై సామూహిక లైంగిక దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.రమణ అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, మహిళలకు రక్షణ కల్పించడంలో హోంశాఖ విఫలమైందని, నిర్భయ, మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. చట్టాలు చేయడమే కాదు వాటిని అమలు చేసే బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో రోజురోజుకు అత్యాచార ఘటనలు పెరిగిపోతున్నాయని, ప్రధానంగా విద్యార్థులపై ఇటువంటివి తరచూ జరుగుతున్నాయని అన్నారు. యువత మద్యం, గంజాయి, మాదకద్రవ్యాలకు అలవాటు పడి ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. దోషులు ఎంతటి వారైనా శిక్ష పడినట్లు అయితే భయం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.అర్జున్, ఎం.వినయ్, వి.బాల, డి.సింహాద్రి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సహస్ర శివనామాలతో పూజలు



మోదమాంబ ఆలయం వద్ద శివస్వాములు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరులోని మోదమాంబ ఆలయంలో ఏర్పాటు చేసిన శివస్వాముల పీఠంలో గురువారం వెయ్యి శివనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ మాలలు ధరించిన పడాల అప్పలనాయుడు, కాతా చిరంజీవి, వంజు వంజుల నాగరాజు, శీరా తలుపులునాయుడు, అప్పాన కోటీశ్వరావు, కాకర సన్యాసిరావు, గుమ్మాల నర్సింగరావు, జొన్నపిల్లి నాగరాజు, కోర్ని కుమార్, ఎస్. శంకరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఏటా శివ మాల ధరించి పూజలు నిర్వహిస్తారు. ప్రతి రోజు రాత్రి పార్వతీ పరమేశ్వరులకు పూజలు నిర్వహిస్తున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 2,810 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,840	4,310
మొదటి రకం	3,490	4,000
రెండో రకం	3,280	3,760
మూడోరకం	3,000	3,250

అనకాపల్లి సినిమాలు

జీబ్ర	: రాజా
మందిర	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మెకానిక్‌రోకీ	: షిర్డిసాయి
లక్కీ భాస్కర్	: వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	: శ్రీసత్య
దేవకీనందన వాసుదేవ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్ 4 యూనిట్లు, బి పాజిటివ్-12 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 356 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 329 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

క్రీడా మైదానం..
సమస్యలతో సతమతం

- కనీస సదుపాయాలకు నోచుకోని ఎన్టీఆర్ స్టేడియం
- తాగునీరు, మరుగుదొడ్లకూ ఇక్కట్లే
- గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జిమ్ అందుబాటులోకి తేవాలంటున్న వాకర్లు
- రక్షణ గోడ నిర్మించి.. గేట్లు మరమ్మతు చేయాలని డిమాండ్



క్రీడా మైదానంలో కొత్తగా ఏర్పాటు చేసిన జిమ్



గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరు



క్రీడా మైదానం ప్రవేశద్వారం

అనకాపల్లి: కరోనా విపత్తు తర్వాత వ్యాయామంపై అన్ని వర్గాల ప్రజలకు ఆసక్తి పెరిగింది. చిన్నాపెద్దా తేడా లేకుండా అంతా నిత్యం వ్యాయామం చేస్తున్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానం బ్రిటీష్ కాలంలో ఏర్పాటు చేశారు. ఈ మైదానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. జాతిపిత మహాత్మాగాంధీ ఈ క్రీడా మైదానంలో స్వాతంత్ర్య ఉద్యమం కోసం అప్పటి ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఇక్కడ సమావేశం నిర్వహించారు. ఈ క్రీడా మైదానంలో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలు జరుగుతున్నాయి. వివిధ పార్టీల నేతలు సభలు, సమావేశాలు నిర్వహించేందుకు ఈ మైదానం ఎంతగానో ఉపయోగపడుతుంది. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత ఆగస్టు 15, జనవరి 26 వంటి ప్రత్యేక దినాల్లో కలెక్టర్ ఇక్కడ జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్నారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన క్రీడా మైదానం నేడు సమస్యలతో సతమతమవుతోంది. మైదానం అభివృద్ధిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు.

- పట్టణ నడిబొడ్డున ఎన్టీఆర్ క్రీడా మైదానం ఉండడంతో గత వైఎస్సార్‌సీపీ పాలనలో సుమారు రూ.80 లక్షల జీవీఎంసీ నిధులతో అత్యాధునిక జిమ్ ఏర్పాటు చేశారు. అయితే దీనిని నేటి పాలకులు ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా పడి ఉంది. జిమ్ సమీపంలో జీవీఎంసీ షాపింగ్ కాంప్లెక్స్ ఉండడంతో ఆ షాప్‌ను అద్దెకు తీసుకున్న ఒక బ్యాకరీ యజమాని జీవీఎంసీ గోడ పడగొట్టి జిమ్ స్థలంలో బ్యాకరీకి అనుగుణంగా వివిధ రకాలైన తినుబండారాల వంటకాలు చేస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో ఈ వ్యాపారి వ్యవహారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.
- క్రీడా మైదానంలో ఉదయం, సాయంత్రం సుమారు 1200 మంది వాకింగ్, రన్నింగ్ చేస్తున్నారు. విద్యార్థులు క్రికెట్, ఫుట్‌బాల్ వంటి ఆటలు ఆడుతున్నారు. మైదానంలో తాగునీటి సౌకర్యం లేకుండా పోయింది. నీళ్లు తాగాలంటే బయటికి వెళ్లి తాగాల్సి ఉంటుంది. గత పాలనలో సుమారు రూ.లక్ష నగదుతో తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. దీనికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చి, మోటార్ ఏర్పాటు చేసినట్లయితే అందరికీ మేలు జరుగుతుంది.
- క్రీడా మైదానంలోమరుగుదొడ్డి లేకపోవడంతో స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి వెళ్లే రహదారిలో ఉన్న సులభ్ కాంప్లెక్స్‌కు వెళ్లాల్సి వస్తుంది. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలు జరిగినప్పుడు వివిధ రాష్ట్రాలు, జిల్లా నుంచి క్రీడల నిమిత్తం వచ్చిన మహిళా క్రీడాకారిణులకు ఇబ్బందులు తప్పడం లేదు.



అసంపూర్తిగా నిర్మించిన మరుగుదొడ్డి

- క్రీడా మైదానానికి మూడు పెద్ద గేట్లు, నాలుగు చిన్న గేట్లు ఉన్నాయి. చిన్నగేట్లు శిథిలావస్థకు చేరుకోవడంతో రాత్రి సమయంలో మందుబాబులకు మినీసైజ్ బార్‌లా ఉపయోగపడుతోంది. మైదానంలో స్టేడియం సమీపంలో రక్షణ గోడ పడిపోవడంతో కొందరు ఆకతాయిలు న్యూకాలనీ నుంచి రాత్రి సమయంలో మైదానంలోకి ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.
- వర్షం వస్తే మైదానం చెరువును తలపిస్తుంది. మైదానం చుట్టూ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి వర్షపు నీరు బయటకు పోయేందుకు సరైన మార్గం చూపాలని క్రీడాకారులు, వాకర్లు కోరుతున్నారు.
- ఈ మైదానంలోనే రెండు గదుల్లో జిల్లా క్రీడా అధికారి ఉంటున్నారు. మరో పక్క రెండు సచివాలయాల ఉద్యోగులు ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ మైదానంలో ఎటువంటి మౌలిక సదుపాయలు కల్పించకపోవడంతో అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.



మైదానంలో వ్యాపారికి చెందిన వంట సామగ్రి

తాగునీరు, మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాలి..



సుమారు 14 సంవత్సరాలుగా క్రీడా మైదానంలో వాకింగ్ చేస్తున్నాను. తాగునీరు, మరుగుదొడ్డి సౌకర్యాలు లేవు. దీని వల్ల మహిళా వాకర్లు ఇబ్బంది పడుతున్నారు. వర్షం పడినప్పుడు మైదానం చెరువును తలపిస్తుంది. మూడు రోజుల పాటు నీరు నిల్వ ఉండిపోయి, దుర్వాసన వస్తుంది. దీనిపై ప్రజా ప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఓంనమఃశివాయ, వాకర్, అనకాపల్లి

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలి..



రక్షణ గోడ పడిపోయి సుమారు ఏడాది అవుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడు లేడు. సభలు, సమావేశాలు నిర్వహించిన తర్వాత చెత్తా చెదారం తొలగించడంలో చర్యలు తీసుకోవాలి. మైదానంలో ఏర్పాటు చేసిన జిమ్‌ను క్రీడాకారులు, వాకర్లకు అందుబాటులోకి తీసుకురావాలి. వాచ్‌మేన్‌ను ఏర్పాటు చేసి, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– కె.హరనాథ్‌బాబు, లక్ష్మీదేవిపేట, అనకాపల్లి

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన తప్పనిసరి



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్న మహిళలతో డాక్టర్ దోలోరోసా ఫెర్నాండెజ్

అనకాపల్లి: క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని, ఏడాదికి రెండుసార్లు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి వైద్యురాలు డోలోరోసా ఫెర్నాండెజ్ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామైన కేఎన్ఆర్‌పేట రాజుపాలెం రహదారిలో 103 మందికి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో క్యాన్సర్ వ్యాధితో ఎంతో మంది మృత్యువాత పడుతున్నారని, సకాలంలో చికిత్స తీసుకున్నట్లు అయితే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. క్యాన్సర్ వ్యాధి సోకిందని కొంత మంది భయంతో చనిపోతున్నారని, భయపడకుండా వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది, కేఎన్ఆర్‌పేట బాప్టిస్ట్ ఫలిగ్రీమ్ చర్చి ప్రతినిధి పోతుల అన్నిసోఫియా(డాలీ), గ్రామ పెద్దలు ఈత గోపి, యు.చంటి, సీహెచ్ దుర్గాప్రసాద్, జి.వెంకటేశ్వరరావు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిమ్‌ల విడుదలకు వినతి

అనకాపల్లి: భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిమ్‌లు టీడీపీ ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ అన్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో కార్మికులు కష్టపడి దాచుకున్న రూ.వెయ్యి కోట్లు ఉన్నాయని, ఈ నిధులను ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి విడుదల చేయాలని ఆయన కోరారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో పవన్ కల్యాణ్ రూ.కోటి నగదు ఇస్తామని హామీ ఇచ్చారని, దానిని తక్షణం అమలు చేయాలని ఆయన కోరారు.

సక్రమంగా మధ్యాహ్న భోజన పథకం నిర్వహించాలి



పాఠ్యాంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

తుమ్మపాల: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని, విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో శంకరం గ్రామంలో గల మండల పరిషత్ పాఠశాలను గురువారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో సౌకర్యాలు, మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందించే భోజనంపై అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలపై విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. విద్యతో పాటు క్రీడలపై మక్కువ పెంచేలా విద్యార్థులను తయారు చేయాలన్నారు. అంతకు ముందు రాజీవ్ గృహకల్ప సముదాయంలో నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. వేగంగా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పసుపులేటి లక్ష్మి, రామకృష్ణ, ఎస్. నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిశుభ్ర వాతావరణంతో ఆరోగ్యకర జీవనం



తడి-పొడి చెత్త బుట్టలు అందజేస్తున్న సర్పంచ్ పెంటయ్య నాయుడు

అనకాపల్లి: మనం ఆరోగ్యంగా జీవించాలంటే పరిశుభ్ర వాతావరణం తప్పనిసరి అని తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు అన్నారు. మండలంలో తుమ్మపాల గ్రామం కొత్తపేటవీధిలో ఇంటి పన్ను చెల్లిస్తున్న గృహ యజమానులకు తడి, పొడి చెత్తబుట్టలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు గృహాల్లో చెత్తా చెదారాన్ని తడి, పొడిచెత్త వేసేందుకు రెండు ప్లాస్టిక్ బుట్టలను పంపిణీ చేసినట్లు తెలిపారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు వచ్చినప్పుడు చెత్తబుట్టలను అందజేయాలని ఆయన కోరారు. మండలంలో తుమ్మపాల మేజర్ పంచాయతీని ఇప్పటికే సుమారు రూ.6 కోట్ల నిధులతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. మిగిలిన పనులు దశల వారీగా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రహదారులపై చెత్త వేయడం వల్ల వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పంచదార్ల కన్నారావు, పంచాయతీ కార్యదర్శి సత్యప్రసాద్, గ్రామ నాయకులు బొడ్డపాటి రామకుమార్, చదరం చిన్న, రాజారావు, ఆర్టీసీ సత్యనారాయణ, తర్ర సత్యారావు, బోయిన నాగరాజు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


యూటీఎఫ్ మండల అధ్యక్షునిగా బాబూరావు



యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం

అనకాపల్లి: యూటీఎఫ్ మండల అధ్యక్షునిగా మామిడి బాబూరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా నాతవరపు సతీష్, గౌరవాధ్యక్షునిగా బైలపూడి దేవుడునాయుడు, సహాధ్యక్షులుగా కొమ్మోజు సత్యవేణి, శిరసపల్లి శ్రీనివాసరావు, కోశాధికారిగా కృష్ణకిషోర్, కార్యదర్శులుగా బి.వి.సత్యనారాయణ, కురందాసు నారాయణ, పావని, పి.రమణ, ఎం.జగన్నాథం, రవీంద్రపాత్రుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం.తేజ్‌వర్ధన్, మహిళా సబ్ కమిటీ సభ్యురాలుగా పి.పల్లవి, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.రాజు నాయుడు, ఆర్.అక్కునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వాహకులుగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గొంది చిన్నాబ్బాయ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా చిన్నబ్బాయ్ మాట్లాడుతూ పై కమిటీ రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు.

బల్క్ డ్రగ్ పార్కు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



మాట్లాడుతున్న లోకనాథం

అనకాపల్లి: నక్కపల్లిలో 2021 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నక్కపల్లిలో ఇప్పటికే హెటిరో పరిశ్రమ విడుదల చేస్తున్న వ్యర్థాలతో మత్స్యకారుల ఉపాధి దెబ్బతిందని, హెటిరో పరిశ్రమ వాయు కాలుష్యం కారణంగా పరిసర గ్రామాల ప్రజలు వివిధ రోగాలతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన చెప్పారు. పార్టీలన్నీ పారిశ్రామికాధిపతుల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయి తప్ప ప్రజల ప్రయోజనాలను పట్టించుకోవడం లేదన్నారు. గతంలో కాకినాడ జిల్లా తొండంగిలో తీవ్ర కాలుష్యం వెదజల్లే బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయాలని చూస్తే అక్కడి ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున ఉద్యమించారని అన్నారు. పరవాడ మండలం తాడి గ్రామం కాలుష్య కోరల్లో చిక్కుకుని ప్రజలు అల్లాడిపోతున్నట్లు ఆయన తెలిపారు. తమ గ్రామాన్ని తరలించమని తాడి ప్రజలు ప్రభుత్వ అధికారులను కోరుతున్నప్పటికీ నేటికీ పట్టించుకోలేదన్నారు. కాలుష్యకారక పరిశ్రమలు కాకుండా కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఇష్టపడి చదివితే ఎంతో మేలు



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు తదితరులు

అనకాపల్లి: కష్టపడి చదవడం కంటే ఇష్టపడి చదువుకుంటే ఎంతో మేలు జరుగుతుందని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు అన్నారు. సత్య సాయిబాబా 99వ జయంతి వేడుకల్లో భాగంగా జిల్లా స్థాయిలో ఎస్సే రైటింగ్ పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవడం వల్ల ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు సత్య సాయిబాబా జీవిత చరిత్ర గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయిబాబా ట్రస్ట్‌ల జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు, సభ్యులు మూర్తి, కామరాజు, సాయిలక్ష్మి, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాలల మహాగర్జనకు తరలి రావాలి



మాలల మహాగర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అనకాపల్లి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా డిసెంబర్ 8న చలో విశాఖ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉత్తరాంధ్ర మాలల మహాగర్జన ప్రతినిధులు చిట్ల చలపతి, రేబాక మధుబాబు తెలిపారు. స్థానిక మెయిన్‌రోడ్డు దళిత సంఘం భవనంలో గురువారం చలో విశాఖ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ, ఐక్యతతో రాజ్యాధికారం కోరుకునే ప్రతి ఒక్కరూ ఆరోజు విశాఖలోని గురజాడ కళాక్షేత్రంలో జరిగే మాలల గర్జన కార్యక్రమానికి తరలి రావాలని కోరారు. తీర్పును పునరాలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు ఎం.అప్పలరాజు, మర్ర చంద్రశేఖర్, తట్ట నాయుడు, చాపల నూకరాజు, గంట్యాడ రమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థిని అదృశ్యం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం దుర్గినాయుడు వీధికి చెందిన పదో తరగతి విద్యార్థిని ఈనెల 19న అదృశ్యమైనట్లు పట్టణ పోలీస్‌లకు గురువారం ఫిర్యాదు అందింది. ఈ మేరకు విద్యార్థిని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఈశ్వరరావు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: మండలంలోని కొత్తూరు విద్యుత్ శాఖ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల నిమిత్తం ఈనెల 22 ఉదయం 9 నుంచి 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు కశింకోట డివిజన్ ఏఈ ఎస్. రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ కొత్తూరు టౌన్-1 ఫీడర్, 11 కేవీ కశింకోట ఎంహెచ్‌క్యూ ఫీడర్ పరిధిలో ఈ అసౌకర్యం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నరసింగబిల్లి సబ్ స్టేషన్ పరిధిలో..

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. నరసింగబిల్లి, గొబ్బూరు, చింతలపాలెం, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, పరవాడ పాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, ఏఎస్‌పేట, గొబ్బూరుపాలెం, నరసాపురం, ఏనుగుతుని, సోమవరం, నూతలగుంటపాలెం, జి. భీమవరం, అడ్డాం, అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాల్లో నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు. ఈ విషయన్ని గుర్తించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డుపై పారుతున్న మురుగు



జాతీయ రహదారిలో కప్పేసిన డ్రైనేజీ

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన కేఎన్ఆర్‌పేట నుంచి సిరసపల్లి రహదారిలో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా కప్పివేయడంతో డ్రైనేజీ మురుగు పారే దారి లేక జాతీయ రహదారిపై పారుతోంది. జోనల్ కార్యాలయానికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలు రిపేర్ కోసం డ్రైనేజీని కప్పివేసినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

అనకాపల్లి: మండలంలో జాతీయ రహదారి పిసినికాడ గ్రామంలో ఆగి ఉన్న ఆటోను ఆర్టీసీ బస్ ఢీకొనడంతో ఆటో డ్రైవర్‌కు స్వల్పగాయాలు అయ్యాయి. యలమంచిలి నుంచి విశాఖ వెళ్తున్న ఆర్టీసీ బస్ గురువారం ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంపై రూరల్ పోలీస్‌లకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.